క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ చింతచెట్టు చౌరస్తా నుంచి నుంచి బంజారి దర్వాజ రోడ్డులో విద్యుత్ స్థంభాలకు పక్కకు మార్చుతున్నందున శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ సందీప్ తెలిపారు. అలిజాపూర్, పాష కాలనీ ప్రాంతాలలో సరఫరా పైన పేర్కొన్న సమయంలో ఉండదని ఆయన వివరించారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

మణికొండ: నార్సింగి మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది బోజన విరామ ధర్నా చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 2వ పీఆర్‌సీ కమీషన్‌లో వారికి అవకాశం కల్పించాలని, సిబ్బందికి కేటగిరిల వారీగా వేతనాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి వేతనాలు చెల్లించాలని, ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ. 25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి దహన సంస్కారాలకు రూ. 30వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఐకార్యక్రమంలో అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్దులగుట్ట జాతర ప్రారంభం


సిద్దులగుట్ట దేవాలయం

శంషాబాద్ ప్రతి ఏటా శ్రావణమాసం వారంలో మూడు రోజుల పాటు జరిగే శ్రీ వెండి కొండ సిద్దేశ్వరాలయం (సిద్దులగుట్ట) జాతరకు ముస్తాబైంది. శనివారం రాత్రి శంషాబాద్ పట్టణంలోని బసవేశ్వరమంతం నుంచి వైభవంగా స్వామి వారి ఊరిగేంపుతో జాతర ప్రారంభమవుతుంది. ఆది, సోమవారాల్లో కల్యాణం, రుద్రాభిషేకం, అగ్నిగుండాలు, జలాభిషేకం అన్నదానం కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన


బతుకమ్మల ర్యాలీ చేపడుతున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు

శంషాబాద్ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్దీకరించాలంటూ గత ఐదురోజులుగా వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. శుక్రవారం బతుకమ్మలను ర్యాలీగా తీశారు. అనంతరం బతుకమ్మల వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి తమ డిమాండ్లను పరిష్కరించాలంటు వేడుకున్నారు. జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే





శంషాబాద్ : పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నానమ్మలు, అమ్మమ్మలతో సందడిగా మారింది. విద్యార్థుల్లో మానవ సంబంధాల విలువలను పెంపొదించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించిన్లు ప్రిన్సిపాల్ నిషా తన్వీర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారికి ఘనంగా స్వాగతం పలకడంతో వారి పాదపూజ ఇతర కార్యక్రమాలను నిర్వహించి ఆడిపాడారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మియాపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్ పరిధిలోని 100 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన రూ.1,00,11,116లు ఆర్థిక సహాయం చెక్కులను మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

అస్తవ్యస్తంగా రోడ్లు... పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు..



అత్తాపూర్: జనావాసాలకు అనుగుణంగా డ్రైనేజీ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో సమస్యలు ఎప్పటికప్పుడు జటిలమవుతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పలు ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతోనే సమస్య వచ్చి పడుతుందని స్థానికుల ప్రజలు వెల్లడిస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు, పాలకులు సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంది. డ్రైనేజీ నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాల్సిన అవసరం ఉంది. ఒక గ్రామంలో వెయ్యి గృహాలతో ఉండగా అదే ప్రాంతంలో అధిక సంఖ్యలో వెలిసిన అపార్ట్‌మెంట్ల ద్వారా ఒక్కో అపార్ట్‌మెంట్‌లో ఒకే ఇంటి స్థలంలో 100 అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే అత్తాపూర్ ప్రాంతంలో జనప్రియ యుటోపియా ప్రాంతంలో వందలాదిగా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వెయ్యి గృహాలు ఉన్న ప్రాంతంలో లెక్కకుమించి అపార్ట్‌మెంట్లు వెలవడంతో ఆ ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణాలు అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాలు లేకపోవడంతో రోజురోజుకూ సమస్య మరింత జటిలమవుతుంది. ఇప్పటికైనా అత్తాపూర్‌లో దూర దృష్టితో ప్రణాళిక సిద్ధం చేస్తూ అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




లంగర్‌హౌజ్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్‌కు వెళ్లే రహదారిలో గోతులమయంగా మారిన రోడ్లు

మణికొండలో ఉపాధ్యాయులకు సన్మానం

మణికొండ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, వారి సేవలను సమాజాన్ని మరింత ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బిల్డర్ విఠల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మాంగ్యానాయక్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: భారీ వర్షాలకు నేలకు ఒరిగిన చెట్ల కొమ్మలను శుక్రవారం తరలించే పనులను అధికారులు చేపట్టారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి పరిధిలో కూలిన చెట్టు కొమ్మలను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ చెట్టు కొమ్మలను డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



రాజేంద్రనగర్: అగ్రవర్ణాల ఆగడాలు రోజు రోజుకు అధికమవుతున్నాయని దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించినప్పుడే ఈ దాడులు ఆగుతాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి అన్నారు. శుక్రవారం బుద్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్సింగి మున్సిపల్ వట్టినాగులపల్లి బొడ్రాయి పూజలో దళితులను పాల్గొనవద్దని పాల్గొన్న వారిపై అతికిరాతకంగా దాడి చేశారన్నారు. అగ్రవర్ణాల ఆగడాలు మితిమీరిపోతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడ్డ అగ్రవర్ణాల వారిని తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక పదాలను అనువదించడం అవసరం

రాయదుర్గం: సాంకేతిక పదాలను భారతీయ భాషలకు అనువదించడం అవసరమని నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ (ఎన్‌టీఎం) ఇన్‌చార్జి అధికారి డాక్టర్ తారీఖ్‌ఖాన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో సెంటర్ ఫర్ అప్లెడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ (సీఏఎల్‌టీఎస్), హెచ్‌సీయూ, ఎన్‌టీఎం, సీఐఐఎల్ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషలలో అనువాద సమానమైన వాటి పరిశీలన' అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనువాదం యొక్క స్పష్టత, సమర్థతపై దృష్టి పెట్టాలని, అందుకోసం ఆలోచనాత్మక, శక్తివంతమైన చర్చలను వర్క్‌షాప్‌ల ద్వారా జరపాలని సూచించారు. సీఏఎల్‌టీఎస్ విభాగం అధ్యాపకులు, వర్క్‌షాప్ సమన్వయకర్త డాక్టర్ నరేష్ అన్నెం , ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

'నిథమ్'లో పర్యాటక దినోత్సవ సంబరాలు-2023

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్), రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(టీఎస్‌టీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రకాల పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫొటోగ్రఫీ పోటీలకు ఏర్పాట్లు చేశారు.ఫొటోగ్రఫీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ 20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, షార్ట్ ఫిల్మ్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, ఇన్‌స్టాగామ్‌రీల్స్, ఫొటోగ్రఫీల విజేతలకు రూ.10, రూ.5వేలు, రూ 3వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి కింద అందిస్తారు. ఈ పోటీలలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు కోసంhttps.nithm.ac.in/registration.php లో చేసుకోవాలి. హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక, అతిథ్యరంగాలకు చెందిన అంశాలకు సంబంధించిన వాటిని పంపాలి. ఒక్కరు ఒక ఎంట్రీని మాత్రమే పంపడానికి అవకాశం ఉంటుంది. డాక్యుమెంటరీ ఫిల్మ్ సమర్పణలు 20 నుంచి 30 నిమిషాల నిడివి ఉండాలి. షార్ట్ ఫిల్మ్ సమర్పణ 10 నుంచి15 నిమిషాల మధ్య ఉండాలి. రీల్స్ 90 సెకన్లకు మించకూడదు. ఫోటోగ్రఫీ ఎంట్రీలను జేపీఈజీ లేదా పీఎన్‌జీ ఫార్మాట్‌లో హై రెజల్యూషన్ ఇమేజ్‌లుగా పంపాలి.తమ సమాచారం, పోటీలకు పంపే ఎంట్రీలను పంపడానికి గడువు తేదీ సెప్టెంబర్ 15వ తేదీ. విజేతలను సెప్టెంబర్ 25వ తేదీ ప్రకటిస్తారు. ఈ పోటీలలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు.

కోకాపేటలో సినీ తారల సందడి


కోకాపేటలో మిర్రర్స్ సెలూన్‌ను ప్రారంభించిన నటి రాశీఖన్నా


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటుడు మహేష్ బాబు సతీమణి నమ్రత, కూతురు సితారలు

మణికొండ: టాలీవుడ్ సెలబ్రిటీలు హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో సందడి చేశారు. ఇక్కడి రాయ్‌చందాని బిజినెస్ బేలో నూతనంగా ఏర్పాటు చేసిన మిర్రర్స్ లగ్జరీ సెలూన్‌ను నటి రాశీఖన్నా ప్రారంభించగా హీరో మహేష్‌బాబు సతీమణి నమ్రత శిరోడ్కర్, కుమార్తె సితారలు హాజరయ్యారు. రాశీఖన్నా మాట్లాడుతూ అందంగా ఉండాలనేది అందరి కోరికన్నారు. అలాంటి వారి కోరికలను మిర్రర్ లగ్జరీ సెలూన్స్ లాంటి సంస్థలు తీరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నటి జయసుధ, సుధ, జీవితారాజశేఖర్, శివాని, చాందినీ చౌదరి, సంజనా గర్లాని నవదీప్, దగ్గుబాటి అభిరామ్, కిరణ అబ్బవరం, కలర్ ఫోటో ఫేమ్ సందీప్‌రాజ్, సినీ దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్, రాజా రవీందర్, ఇండియన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలు, చేతివృత్తులకు చేయూత

- ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ చంద్రశేఖర్
- హైటెక్స్‌లో పారిశ్రామిక, ఇండెక్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం భారతీయ హస్తకళా సాంప్రదాయాలను పునరుద్ధరిస్తుందని, కళాకారులను ప్రోత్సహిస్తుందని భారతప్రభుత్వ ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న పారిశ్రామిక, ఇండెక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళాకారులు, చేతివృత్తుల వారికి రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. వరంగల్‌లో ఈ పథకాన్ని వివిధ మంత్రులు ప్రారంభిస్తారన్నారు. చేతివృత్తి దారులకు 5 శాతం తక్కువ వడ్డీ రేటుతో రూ.లక్ష వరకు రుణాలను అందజేస్తుందన్నారు. ఇండోర్ ఇన్ఫోలైన్ ఎండీ ఎక్స్‌పో నిర్వాహకుడు రాజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ఇండెక్స్‌పో పరిశ్రమ నిపుణులు, ఔత్సాహికులు , తయారీ పరిశ్రమలో తాజా పురోగతులపై చర్చిస్తామన్నారు. ఈ ప్రదర్శనలో 100 మంది ఎగ్జిబిటర్లు, హ్యాండ్ టూల్స్, మెషీన్ టూల్స్, రోబోటిక్స్, ఇండస్ట్రీయల్ ఆటోమేషీన్, సోలార్ పవర్‌ప్లాంట్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, సెఫ్టీ ఉత్పత్తులు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం ఉచితమని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.


ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న భారతప్రభుత్వ ఎంఎస్ఎంఈ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కమ్యూనిటీహాల్‌లో గురువారం రాత్రి రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గసభ్యురాలు సుమతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో రెడ్డిలు వ్యాపారం, రాజకీయ రంగాలలో రాణిస్తున్నారన్నారు. ఒకరికొకరు సహకరించుకుని రాణించాలన్నారు. మణికొండ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, కోశాధికారి శ్రీపతిరెడ్డి పాల్గొన్నారు.


సుమతిరెడ్డిని సత్కరిస్తున్న రెడ్డి సంఘం మహిళలు

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శంషాబాద్: ప్రయాణాలు చేసి తిరిగి వచ్చిన వారిలోనే గుండెపోటు బాధితులు అధికంగా ఉంటున్నారని సీఐఎస్ఎఫ్ డీఐజీ శ్యామల అన్నారు. సుదీర్ఘ ప్రయాణాల్లో ఆరోగ్య సమస్యలున్న వారిలోనే ఇలాంటి సమస్యలుంటాయని వైద్యులు పేర్కొంటున్నారని, విలువైన క్షణాల్లో వారి జీవితాన్ని కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ప్రాంగణంలో శుక్రవారం కిమ్స్ ఆస్పత్రి వైద్యబృందంతో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్డియాక్ అరెస్ట్ అయిన వారికి ఎంత త్వరగా సీపీఆర్ జరిగే అంతమేలు జరుగుతుందన్నారు.

ముగిసిన శ్రావణ శుక్రవార పూజలు

మణికొండ: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. గృహాలను అందంగా అలంకరించుకుని, అమ్మవారి పీఠాలను ఏర్పాటు చేసుకుని శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఇష్టమైన పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. పూజకు వచ్చిన మహిళలకు వాయినాలను ఇచ్చి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.



ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు


అంబేడ్కర్ చౌరస్తా వద్ద దిమ్మెలకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాజేంద్రనగర్: రోడ్లపై ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ నర్సింహా వెల్లడించారు. రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్న దిమ్మెలకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్‌ఆర్‌పై నుంచి రాజేంద్రనగర్ వైపు వస్తున్న వాహనాదారులు రోడ్డు మధ్యలో ఉన్న దిమ్మెల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రాత్రి సమయంలో ఇవి సరిగ్గా కనిపించకపోవడం కారణంగా వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకురావడంతో రేడియం అతికించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి జగన్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులున్నారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఉందని బీజేవైఎం నాయకులు కొంగళ్ల నవీన్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ పేద ప్రజల సంక్షేమానికి ఎనలేని కృషి అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు.


రాజేంద్రనగర్ నియోజకవర్గ టికెటు కోసం దరఖాస్తు చేసుకుంటున్న కొంగళ్ల నవీన్

హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం


చిత్రాలను తిలకిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి కళాకారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని ప్రజలు వాటి ప్రత్యేకతలను తెలుసుకోవాలని కోరారు. కళాకారులు వేసిన 175 చిత్రాలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయని ,ఈనెల 10వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.



హైలైఫ్ జువెల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి నందిత, నిర్వాహకుడు డొమినిక్ తదితరులు

మాదాపూర్: యువతను ఆకట్టుకునే ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని నటి దీక్షనగర్‌కర్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ జువెల్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. నటీమణులు నందితా శ్వేత, ప్రక్షా అయ్యగారి, ఆషురెడ్డి, కామాక్షి భాస్కర్ పాల్గొన్నారు. నిర్వాహకుడు డొమినిక్ మాట్లాడుతూ టాప్ జువెలరీ బ్రాండ్‌లు, ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.